

టిడిపితోనే బిసిల సమగ్రాభివృద్ధి
ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

బిసిల సమగ్రాభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కోపల్లెలో శుక్రవారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బిసిల సంక్షేమాన్ని నీరుగార్చిందన్నారు. జగన్మోనరెడ్డి అన్ని విధాలా బిసిలను మోసగించారని విమర్శించారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందుకు ప్రజలంతా వెన్నంటి ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధిస్తుందని, దాంతో బిసిలకు సముచిత న్యాయం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి వైపు.. పశ్చిమ అడుగులు..



- వ్యవసాయం, మత్స్యరంగాలకు పెద్దపీట
- 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు
- శకటాల ప్రదర్శన, ఆకర్షించిన ప్రత్యేక స్టాల్స్
- ఉత్తమ సేవలందించిన 224 మందికి అవార్డుల ప్రదానం



జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌పి రవి ప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా అతికొద్ది కాలంలోనే అన్ని రంగాలో సమగ్ర అభివద్ధి వైపు అడుగులు వేస్తోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్ పెరేడ్ ప్రాంగణంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతిపై జిల్లా కలెక్టర్ మాట్లాడారు. 1950 జనవరి 26న ప్రజాస్వామ్యం గణతంత్ర రాజ్యాంగా ఆవిర్భవించడం వల్లే భారత ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత్వం, న్యాయాలను పూర్తిస్థాయిలో ఒక హక్కుగా పొందడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలో సంతృప్తి స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతు భరోసా పథకం ద్వారా జిల్లాలో 1.24 లక్షల రైతులకు రూ.75.38 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు తెలిపారు. జిల్లాలో 379 రైతు భరోసా కేంద్రాల్లో 176 పశు వైద్య సహాయకులను నియమించి గ్రామాల్లోని సుమారు 11 లక్షల 92 వేల పశువులకు పశుసంవర్ధక శాఖ ద్వారా చికిత్స అందించామన్నారు. జిల్లాలో అమూల్ డైరీ ద్వారా 31 గ్రామాల్లో రోజుకు సుమారు 7,100 లీటర్ల పాల సేకరణ చేస్తున్నామన్నారు. జిల్లాలో అత్యంత ప్రధానమైన ఆర్థిక వనరుగా ఉన్న మత్స్యరంగం అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. విద్యారంగంలో అనేక విద్యా సంస్కరణలు జరుగుతున్నాయన్నారు. జగనన్న అమ్మఒడి పథకంలో జిల్లాలో 1 నుంచి 12 తరగతి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.13 వేల చొప్పున ప్రోత్సాహక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. నాడు-నేడులో భాగంగా జిల్లాలో రూ.214 కోట్లతో 727 పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. రెండు ఏరియా ఆసుపత్రులు, 512 ఆరోగ్య ఉప కేంద్రాలు, 34 పిహెచ్‌సిలు, 398 వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్, 137 వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 72 వేల మంది అర్హులైన లబ్ధిదారుల కోసం రూ.544 కోట్లు ఖర్చు చేసి అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేశామన్నారు. వాటితోపాటు మరో 20,784 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పట్టాలు అందజేశామన్నారు. ఖరీఫ్ 2023-24 పంట కాలంలో ధాన్యం సేకరణలో భాగంగా 66,863 మంది రైతుల నుండి 4 లక్షల16 వేల, 718 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామన్నారు.



పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల, శకటాల ప్రదర్శనను తిలకించి, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు వివిధ రంగాలలో సేవలందించిన 224 మందికి అవార్డులు అందజేశారు. అనంతరం పలు శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, సెబ్ అడిషనల్ ఎస్‌పి ఎటివి.రవికుమార్, భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.యోగేంద్ర బాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

దేశ భక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతోమందిని ఆకట్టుకున్నాయి. డాగ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రేక్షకుల కరతాళధ్వనులను అందుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భీమవరం తిరుమల విద్యా సంస్థలు, ఆదిత్య విద్యా సంస్థ, నరసాపురం ఎబిఎన్ పిఆర్ఆర్ జూనియర్ కళాశాల, ఉండి ఎపిఆర్‌ఎస్‌డబ్ల్యుఎస్ పాఠశాల, భీమవరం పిఎస్ఎం బాలికల ఉన్నత పాఠశాల, రూస్వీ లక్ష్మీబాయి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ దేశభక్తిని చాటుతూ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తణుకు విద్యార్థులు ప్రథమ బహుమతిని అందుకున్నారు. రూస్వీ లక్ష్మీబాయి మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. భీమవరం ఆదిత్య పాఠశాల తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. ముఖ్యంగా డాగ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అభివృద్ధిని ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన

పలు ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని, అభివృద్ధిని ప్రతిబింబించేలా చేపట్టిన శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా నిలిచాయి. డిఆర్‌డిఎ, వైద్య ఆరోగ్య శాఖ, జలజీవన్ మిషన్, గృహ నిర్మాణ శాఖ, ఫైర్, పోలీస్ శాఖలు, రెవెన్యూ శాఖ విద్యా శాఖల శకటాలు ప్రదర్శించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అగ్నిమాపక శాఖ, జిల్లా పరిశ్రమల కేంద్రం, మహిళాభివృద్ధి స్త్రీ శిశ సంక్షేమ శాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, జిల్లా షెడ్యూల్ కులాలు వెనుకబడిన తరగతుల సేవా సంస్థ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, లీడ్ బ్యాంక్ సంస్థ, ప్రధమ చికిత్స కేంద్రం వంటి ఏర్పాటు చేసిన 12 స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో పాటు పలు రంగాల్లో సేవలందించిన సంఘ సంస్కర్తలు, స్వతంత్ర సమరయోధులను జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సుమారు 224 మందికి అవార్డులు, పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టరు ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి చేతులు మీదుగా ఉద్యోగ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు ఫొటోగ్రాఫర్ పి.యోగ రత్నాకర్. కార్యాలయ సబార్డినేటు జె.రాజేష్ బాబు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థుల నృత్య ప్రదర్శన



వేడుకల్లో ప్రదర్శిస్తున్న శకటం



బైక్ ర్యాలీలో పాల్గొన్న నేతలు

మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

- ఎస్‌కెఎం, ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యాన బైక్ ర్యాలీ
- విస్సాకోడేరు నుంచి భీమవరం పాత బస్టాండ్ వరకూ భారీ ర్యాలీ
- దేశ సంపద కార్పొరేట్లకు దారాదత్తం : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

మహోన్నత వ్యక్తి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్ఫూర్తితో మోడీ అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై కార్మికులు, కర్షకులు, ప్రజలు ఏకతాటిపైకొచ్చి ఐక్యంగా పోరాడాలని ఎస్‌కెఎం బైక్ ర్యాలీకి పిలుపునిచ్చింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలనూ రోడ్డుపైకి నెట్టి ముఖ్యంగా కార్మిక, కర్షకుల పట్ల వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గమని విమర్శించింది. బిజెపి నిరంకుశత్వ పాలన పోవాలంటే ఐక్య ఉద్యమాలకు నాంది పలకాలని, ఆ విధంగా అంతా సిద్ధంగా ఉండాలని, దీనికి ఎస్‌కెఎం ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్మిక, కర్షక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరు మహాలక్ష్మి రైస్‌మిల్లు నుంచి భీమవరం పాత బస్టాండ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు, కర్షకులు, ఇరు సంఘాల నేతలు భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. సుమారు 6 కిలో మీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో కార్మికులు, కర్షకులు మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేసిన నినాదాలు హోరెత్తాయి. ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, వ్యవసాయానికి స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని, ఉపాధి కూలీలకు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద జరిగిన సభకు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వందేళ్ల నుంచి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం పదేళ్లలో అణగదొక్కడానికి ప్రయత్నించిందని, అయితే రైతులు, కార్మికులు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశ, ప్రజల సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. కార్మికులకు, రైతులకు, ప్రజలకు రోజుకు వచ్చే వేతనం రూ.400 ఉంటే అంబానీ, అదానీలకు వేల కోట్ల సంపద వస్తుందని, ఇదెక్కడి నుంచి వస్తుందో ప్రజలు ఆలోచించాలన్నారు. మోడీని సాగనంపితే గాని దేశానికి మంచి జరగదని విజ్ఞప్తి చేశారు. ఈ సభలో అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, రైతు సంఘం జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, తెలుగు రైతు నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, అగ్రగామి కిసాన్ సభ జిల్లా నాయకులు డి.శ్రీనివాసరాజు, రైతు కార్యాచరణ సమితి నాయకులు గోపాలకృష్ణరాజు, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

పెంటపాడు : కేంద్రంలో బిజెపి ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భీమవరంలో జరుగుతున్న మోటార్ సైకిల్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద మోటార్ సైకిల్ ర్యాలీని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో కరక వెంకట్రావు, అల్లు సుబ్బారావు, గంటా కోటి, మాదాసు శ్రీను, యండ్రపు కృష్ణ, వి.దానయ్య, తాడి సుబ్బయ్య, డి.సీతయ్య, మహేష్, దుర్గ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయిస్తాం : ఆర్‌డిఒ

- ఆలమూరులో అర్ధనగ్న ప్రదర్శన, రోడ్డుపై బైఠాయింపు
- సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డిఒ అంబరీష్ హామీ
- దీక్ష విరమించిన దళితులు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)



ఆలమూరులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న దళితులు

ఆలమూరు గ్రామంలో దళితుల శ్మశానవాటికకు స్థలం కేటాయించేందుకు నరసాపురం సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ తెలిపారు. ఆలమూరు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ మూడు రోజులుగా దళితులు పోరాటం చేయడంతో అధికారులు దిగొచ్చారు. శుక్రవారం జాతీయ రహదారిపై బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శన, రాస్తారోకో చేశారు. దీంతో కిలోమీటర్లు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో నరసాపురం సబ్‌కలెక్టర్ అచ్యుత్ అంబరీష్ ధర్నా శిబిరం వద్దకు చేరుకొని దళితులు, కెవిపిఎస్, మాల మహానాడు నాయకులతో చర్చలు జరిపారు. దళితులకు శ్మశానవాటిక కేటాయిస్తామని రాత పూర్వక హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు మాట్లాడుతూ ఆలమూరులో శ్మశానవాటిక కేటాయించాలని దళితులు అర్ధ నగ్న ప్రదర్శన చేసిన రోడ్డుపై బైఠాయించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ సర్వే చేసి శ్మశానవాటిక కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆర్‌డిఒ స్వయంగా హామీ ఇవ్వడంతో గ్రామస్తులు తాత్కాలికంగా ధర్నాను విరమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు పల్లయ్య, బి.మధు సరూప్, అభిషేక్, దళిత సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

బాబుతో పొత్తు పవన్ తప్పిదమే
ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చంద్రబాబు నాయుడుతో పొత్తు పెట్టుకోవడం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న తప్పిదమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇది ఒక అపవిత్ర పొత్తు అన్నారు. పవన్ కళ్యాణ్ అధర్మాన్ని ఆశ్రయిస్తున్నారనే విషయాన్ని మరుస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేసి పేరు తెచ్చుకున్న చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ జతకట్టడం సరికాదన్నారు. తమ పాలన నచ్చితేనే ఓటు వేయాలని జగన్ అడుగుతున్నారని తెలిపారు. చంద్రబాబుకు ఓట్లు అడిగే నైతికత లేదన్నారు. పవన్ కళ్యాణ్ ప్రజలను ఏమని ఓటు అడుగుతారని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వంటి మోసగాళ్ల మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాటలు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని అన్నారు. తెలంగాణలో పార్టీ పెట్టి నమ్మిన నాయకులను, కార్యకర్తలను షర్మిల గాలికొదిలేసిందన్నారు. ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన ఆమె చంద్రబాబు మాటలు వినడం దారుణమన్నారు. బాబు కుటిల రాజకీయాలకు షర్మిల బలైపోతోందని విమర్శించారు. షర్మిలను చంద్రబాబు రాజకీయంగా వాడుకుంటున్నారన్నారు. ఒక అన్నగా షర్మిలకు చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దని సూచన చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

కనకాయలంక సర్పంచి కుమార్తెకు డాక్టర్ పట్టా
గ్రామస్తుల అభినందన



డాక్టర్ పట్టా పొందిన హృదయ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కనకాయలంక గ్రామ సర్పంచి మద్దా శ్రీనివాసరావు (డాక్టర్ వాసు) కుమార్తె హృదయ ఇటీవల డాక్టర్ పట్టా పొందారు. సాధారణ కుటుంబంలో పుట్టిన ఆమె మండలంలోని శివారు మారుమూల గ్రామంలో పుట్టి పెరిగి ప్రాథమిక విద్యను తాటిపాక భాష్యం స్కూల్లో, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో అభ్యసించారు. డెంటల్ కోర్సును అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కళాశాలలో అభ్యసించి డెంటల్ డాక్టర్‌గా పట్టా పొందారు. ఆమెను కనకాయలంక గ్రామస్తులు అభినందించారు. ప్రజలందరితో కలిసిమెలిసి ఉండే ఆమె తండ్రి శ్రీనివాసరావు ఆర్ఎంపి వైద్యునిగా అనేక ఏళ్లుగా గ్రామంలోని ప్రజలకు వైద్యమందిస్తూ పేద మధ్యతరగతి ప్రజలకు సేవలందించి మంచి డాక్టర్‌గా పేరుపొందారు. గత సర్పంచి ఎన్నికల్లో మండలంలోని అతిపెద్ద మెజార్టీతో సర్పంచిగా గెలుపొంది అటు వైద్యునిగా, ఇటు సర్పంచిగా సమర్థంవంతంగా పనిచేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. తండ్రి వృత్తినే ఎంచుకున్న హృదయ డాక్టర్ పట్టాను పొందింది. ఈ నేపథ్యంలో హృదయను వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), టిటిడి బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, వైసిపి మండల కన్వీనర్ పోత్తూరు బుచ్చిరాజు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అభినందించారు.



స్కూల్ ప్రిన్సిపల్‌ను నిలదీస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

విద్యార్థిపై స్కూల్ పిఇటి దాష్టీకం
స్కూల్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం బ్యాంకు కాలనీలోని ఓ ప్రయివేటు స్కూల్ పిఇటి విద్యార్థిని కొట్టడంతో ఒంటిపై వాతలు చూసిన విద్యార్థి తల్లిదండ్రులు శుక్రవారం స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. భీవరంలోని ఓ ప్రయివేటు స్కూల్లో కట్టా దేవేంద్ర లక్ష్మీ రిత్విక్ ఆరో తరగతి చదువుతున్నాడు. అయితే పిఇటి శ్రీధర్ తనను కొట్టాడని విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పాడు. ఒంటిపై వాతలు చూసిన విద్యార్థి తల్లిదండ్రులు స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. పిఇటి శ్రీధర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై స్కూల్ ప్రిన్సిపల్ దానియేలు స్పందించి పిఇటి శ్రీధర్‌పై తక్షణం చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు.



యోగీంద్రబాబును సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

యోగీంద్రబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు

75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో స్వాతంత్ర సమరయోధులను స్మరిస్తూ వారి కుటుంబసభ్యులను కలెక్టర్ పి.ప్రశాంతి సత్కరించారు. స్వాతంత్ర సమరయోధులు, మాజీ ఎంఎల్ఎ, మాజీ ఎంఎల్‌సి సర్దార్ దండు నారాయణరాజు మనువడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, తణుకు నియోజకవర్గ వైసిపి పరిశీలకులు మంతెన యోగీంద్రబాబును కలెక్టర్ ప్రశాంతి సత్కరించి మెమెంటో అందజేశారు. నారాయణ రాజు పశ్చిమగోదావరి జిల్లా మొట్టమొదటి జెడ్‌పి ఛైర్మన్‌గా, డిసిసిబి ఛైర్మన్‌గా పనిచేశారు. నారాయణరాజు మనవడైన యోగీంద్ర బాబును సన్మానిస్తున్న తరుణంలో కలెక్టరేట్ ప్రాంగణం హర్షధ్వానాలతో మారుమోగింది. కార్యక్రమంలో జెసి ఎస్.రామసుందర్ రెడ్డి, కె.శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.



పాలకొల్లులో సంబరాలు చేస్తున్న చిరు, పవన్ పట్టణ యువత

చిరంజీవికి పురస్కారంపై సంబరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రకటించడం పట్ల చిరు, పవన్ పాలకొల్లు పట్టణ యువత శుక్రవారం సంబరాలు జరిపారు. రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రాములింగేశ్వరరావు ఆధ్వర్యంలో పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో మెగా అభిమానులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి ప్రజలకు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు.

నరసాపురం : స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మెగా అభిమానులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కొప్పిశెట్టి శ్రీనివాస్, పులపర్తి సుబ్బారావు, గుగ్గిలపు శివరామకృష్ణ, చెన్నంశెట్టి నాగు, మేడిది ప్రభాకర్, దివి సత్యన్, బల్ల సత్తిబాబు, పోలిశెట్టి సత్తిబాబు, పోలిశెట్టి సాంబ, ఉలిశెట్టి ముఠస్వామి, కర్నేని లక్ష్మీనారాయణ, అడ్డాల బాబీ పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన జట్టును అభినందిస్తున్న సర్పంచుల సుంకర సీతారామ్

వాలీబాల్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కొడమంచిలిలో హోరాహోరీగా జరిగిన వాలీబాల్ పోటీల్లో పోలమూరు జట్టు విజేతగా, ఆచంట జట్టు రన్నర్స్‌గా నిలిచారని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. వాలీబాల్ టోర్నీలో విజయం సాధించిన జట్టులకు, ప్రతి క్రీడాకారునికి అభినందనలు తెలిపారు. జగనన్న ప్రభుత్వం ద్వారా ఆడుదాం ఆంధ్రా భాగంగా సచివాలయ పరిధిలో ప్రతి క్రీడాకారుడు తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచి సూర్యనారాయణమూర్తి

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోలనపల్లి గ్రామ సర్పంచి కొనకంచి సూర్యనారాయణమూర్తి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కోలనపల్లి గ్రామంలో గణతంత్ర దినోత్సవ వేడుక సందర్భంగా పేద కుటుంబానికి సర్పంచి ఆర్థిక సాయం చేశారు. కోలనపల్లి గ్రామానికి చెందిన కర్రి గోవిందనాగేంద్రకుమార్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సర్పంచి సూర్యనారాయణమూర్తి ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతిలకు పేద, బడుగు, బలహీనవర్గాల వారికి చేతనైన సహాయం అందిస్తున్నామని తెలిపారు.

సాంబశివరావుకు ఎంఎల్ఎ రామరాజు అభినందన

ప్రజాశక్తి - ఆకివీడు

ఒక సాధారణ విద్యా సంస్థ అధినేత ఉండ్రమట్ల సాంబశివరావు డాక్టరేట్ పొందడం అభినందనీయమని ఎంఎల్ఎ రామరాజు అన్నారు. ఈ మేరకు సాంబశివరావు దంపతులను రామరాజు శుక్రవారం అభినందించారు. సాంబశివరావు 25 సంవత్సరాలుగా యోగా ధ్యానం అంశాలపై విస్తృతంగా ప్రచారం చేసినందుకు, రాష్ట్రస్థాయిలో సుమారు మూడు వేల తరగతులు నిర్వహించినందుకు ఇటీవల అమెరికా యుఎస్‌కు చెందిన విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సాంబశివరావు దంపతులను ఎంఎల్ఎ కలిసి అభినందించారు. అలాగే టిడిపి మండలాధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్, టిడిపి నేతలు అభినందించారు.

వెంకన్న సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఆకివీడు

స్వాతంత్ర సమరయోధుడిగా, స్థానిక పేద ప్రజలకు హోమియో వైద్యుడిగా సామాజిక సలహాదారుగా వెంకన్న చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు అన్నారు. కట్టా వెంకన్న వర్థంతి సందర్భంగా స్థానిక గౌడ సంఘ నాయకుడు వెంకన్న కుమారుడు నగర పంచాయతీ కౌన్సిలర్ కట్టా రవి ఆధ్వర్యంలో శుక్రవారం అయిభీమవరం మలుపులో పాత గోనెల షాపుల వద్ద కార్యక్రమం నిర్వహించారు. తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విజయ్, స్థానికులు అట్లు రంగారావు, దుంపగడప గ్రామ సర్పంచి విశ్వేశ్వరరావు, మాజీ ఎంపిపి కట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి వృద్ధుడు మృతి


యలమంచిలి : పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్ఐ శివన్నారాయణ తెలిపిన వివరాల ప్రకా రం.. మండలంలోని కరగంపూడి గ్రామానికి చెందిన వాత్సవాయి సోమరాజు(62) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసిక వేదనతో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయనను బంధువులు ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాడవాడలా జాతీయ జెండా రెపరెపలు

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోర్టు ఆవరణలో జాతీయ గీతాలాపన, జాతీయ పతాకావిష్కరణ చేశారు. భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యదేవి మాట్లాడారు.



భీమవరం : అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెసి

ఉండి : ఉండి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు జాతీయ జెండా ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.రవీం దర్, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్ జాతీయ జెండా ఆవిష్కరించారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ మాట్లాడారు.

పోడూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆర్ఐ కె.రాంబాబు జెండా ఆవిష్కరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, ఎంపిడిఒ డి.సుహాసిని, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, సర్పంచి సువర్ణ రాజు పాల్గొన్నారు. మండలంలోని కవిటంలో పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ వైద్యులు పోడూరి కృష్ణమూర్తి, ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ సతీష్‌శర్మ ముఖ్య అతిథిలుగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, చాక్లెట్లు, బిస్కెట్లు అందించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, మహిళా మండలి భవన్ వద్ద పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలోవ్యాధి నిరోధక శక్తిని పెంచే హోమియోపతి మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు.

వీరవాసరం : మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జ్యోతి, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ సుందర్‌రాజు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ఆచంట : మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్య లంక గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు కళాశాల, పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం జాతీయ జెండాను ఎగరవేశారు. ఎంపిడిఒ నరసింహప్రసాద్ మాట్లాడారు.

నరసాపురం : ఆంధ్ర బ్లైండ్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకులకు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు యుకె వనితా క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు వనితా క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు, స్వీట్లు అందించారు. పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. ముఖ్యఅతిథిగా నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ, కౌన్సిల్ సభ్యులు కోఆప్టేడ్ మెంబర్లు హాజరయ్యారు. అనంతరం సన్మానం, బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ వీరవెల్లి సురేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బిజిబిఎస్ ఉమెన్స్ కాలేజీలో కళాశాల చైర్మన్ నూలి శ్రీనివాస్ జెండా ఎగురవేశారు. కోర్టుల ప్రాంగణంలో పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ విజయదుర్గ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పాలకోడేరు : మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నాగేంద్రకుమార్ జెండా ఆవిష్కరించారు. ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మీతులసిలు గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పులమాల వేసి నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసరావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్ జెండా ఆవిష్కరించారు.

కాళ్ల : కోపల్లె ఎస్ఎండిఆర్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పతాకావిష్కరణ అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నిర్మలాదేవి అధ్యక్షత వహించారు. ఐక్య నేషనల్ ఫౌండేషన్, నల్ల విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు విద్యార్థులను తయారు చేసిన సత్యలక్ష్మి టీచర్‌ను అభినందించారు.

తాడేపల్లిగూడెం : ఎపి నిట్‌లోని పరిపాలనా భవనంలో నిర్వహించిన వేడుకల్లో నిట్ డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడారు. శశి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడకల్లో విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడారు. ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ పిఎస్.శేఖర్ 80 క్యాడెట్స్‌చే మార్చ్ ఫాస్ట్ చేయించారు.

తణుకు రూరల్ : ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, పీజీ(అటానమస్), గ్రూఫ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మండలంలోని సజ్జాపురంలోని ఆదిత్య స్కూల్ విద్యార్థులు 300 అడుగల జాతీయ జెండాతో స్కూల్ క్యాంపస్ నుంచి నరేంద్ర సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి వంకా రవీంద్రనాధ్ మాట్లాడారు.

మొగల్తూరు : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ జి.అనితకుమారి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అబ్దుల్ రజాక్, ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ పద్మావతి, పెనుమత్స రంగరాజా జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవిశంకర్ సర్కార్, పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి జయరాజు జాతీయ పతాకావిష్కరణలు చేశారు.

యలమంచిలి : స్థానిక ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో, యలమంచిలి పోలీస్‌స్టేషన్ వద్ద త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు.


ఆకివీడు : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి జయలక్ష్మి, ఎంపిడిఒ వాణి, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ విజయలక్ష్మి, విద్యావికాస్ కళాశాల వద్ద ప్రిన్సిపల్ బలరాంబాబు జాతీయ జెండా ఆవిష్కరించారు.

తణుకు : స్థానిక వైసిపి కార్యాలయం వద్ద రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. టిడిపి కార్యాలయం వద్ద మాజీ ఎంఎల్ఎ రాధాకృష్ణ, వైసిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామచంద్రరావు, మాంటిస్సోరి స్కూల్ వద్ద స్కూల్ డైరెక్టర్ వనపర్తి ప్రకాష్‌రావు జెండాను ఎగురవేశారు.

పాలకొల్లు : వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో గోపీ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ, ఎల్ఆర్.పేటలోని మాంటిస్సోరి స్కూలు మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, పాలకొల్లు సన్ షైన్ స్కూల్లో కరస్పాండెంట్ ఎన్‌విఎస్.పాపారావునాయుడు జెండా ఆవిష్కరించారు. మండలవ్యాప్తంగా పలుచోట్ల జెండా ఆవిష్కరించారు.



కాళ్ల : అవార్డు అందుకుంటున్న మురళీరామరాజు



పాలకోడేరు : అవార్డు అందుకుంటున్న సర్ణలత

పలువురికి కలెక్టర్ చేతులమీదుగా పురస్కారాలు



గణపవరం : అవార్డు అందుకుంటున్న ఎంపిడిఒ



పోడూరు : అవార్డు అందుకుంటున్న సచివాలయ సర్వేయర్లు

స్వర్ణలతకు ఉత్తమ ప్రత్యేక సేవా పురస్కారం

పాలకోడేరు : విస్సాకోడేరు సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ డాక్టర్ డిఆర్.స్వర్ణలతకు అరుదైన ఉత్తమ ప్రత్యేక సేవా పురస్కారం లభించింది. 22 ఏళ్లుగా సమాజానికి స్వర్ణ లత అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందుకున్నారు. భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

ఉత్తమ ఎంపిడిఒగా జ్యోతిర్మయి

గణపవరం : మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గణ పవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి భీమ వరంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలె క్టర్ చేతులమీదుగా ఉత్తమ ఎంపిడిఒ అవార్డును అందుకున్నారు. మండలంలో వ్యవసాయ శాఖలో ఉత్తమ సేవలందించిన వ్య వసాయ శాఖ సహాయకులు ఉత్తమ అవార్డులు అం దుకున్నారు. ఎ.గోపవరం, కేశవరం, ఆర్‌బికె కేంద్రాలకు చెందిన అడబాల హరికృష్ణకు, ముమ్మడి వెంకటప్రసాద్‌కు, పొలంబడి రైతు కొల్లి రామారావు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. గణపవరం పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాల్లో వాలంటీర్లకు, సిబ్బందికి గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అవార్డులు అందించారు.

అధికారులకు అవార్డులు

ఉండి: జగనన్న భూ శాశ్వత హక్కు భూ రక్షా పథకాన్ని మండలంలోని చిలుకూరు, వెలివర్రు గ్రామాల్లో విఆర్ఒ విజయలక్ష్మి తన బృందంతో పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు తీసు కున్నారు. ఉత్తమ తహశీల్దార్‌గా ఏడిద శ్రీనివాస్ ప్రశంసాపత్రం, ఉత్తమ డిప్యూటీ తహశీల్దార్‌గా ఎస్.వీరా స్వామినాయుడు అవార్డు అందుకున్నారు. ఎఎస్ఐ ఆకు రాతి సూర్యనారాయణకు ప్రశంసాపత్రం లభించింది.

పోడూరు : తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, డిప్యూటీ తహశీల్దార్ డి.రాజేష్, మండలంలోని నలుగురు సచివాలయ సర్వేయర్లు కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

కృష్ణమోహన్‌కు అవార్డు

ఆకివీడు : ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్‌కు ఉత్తమ సేవా అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అవార్డును అందించారు.

బొబ్బిలికి మరో సేవా పురస్కారం

వినియోగదారుల సంఘాల ద్వారా రాష్ట్ర ప్రజలకు సుమారు మూడు దశాబ్దాలుగా సేవలందిస్తున్న బొబ్బిలి బంగారయ్యను మరో పురస్కారం వరించింది. వినియోగదారుల సంఘం ద్వారా జిల్లా అధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలకు గాను ఉత్తమ సేవా పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అందించారు.

విద్యుత్ శాఖ సహాయక ఇంజినీర్‌కు అవార్డు

ఉండి : విద్యుత్ శాఖ ఉన్నతాధికారి నుంచి ఉండి మండల విద్యుత్ శాఖ సహాయక ఇంజినీర్ ముదునూరి మాధవరాజు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. భీమవరం డివిజన్‌లో విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలందిస్తూ మండలంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్న మాధవరాజుకు ఉత్తమ సహాయక ఇంజినీర్ అవార్డు రావడం సంతోషకరమని ఉండి మండల విద్యుత్ సలహా మండలి అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు.

కాళ్ల : డ్రెయిన్ల ప్రక్షాళన చేసి రైతులకు మేలు చేసినందుకు పాతపాటి మురళీరామరాజుకు గణతంత్ర పురస్కారం దక్కింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అవార్డు అందించారు.



ఉండి : అవార్డులు అందుకున్న అధికారులు



ఆకివీడు : అవార్డు అందుకుంటున్నబంగారయ్య



గణపవరం : అవార్డులు అందుకుంటున్న వ్యవసాయశాఖ సహాయకులు



ఉండి : అవారు అందుకుంటున్న మాధవరాజు

టైఫాయిడ్ జ్వరంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు



శేషకుమారి (ఫైల్‌ఫొటో)

మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటిపాలెం గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ తోరం శేషకుమారి (45) శుక్రవా రం మృతి చెందారు. శేషకు మారి గత పది రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో బాధపడు తుంది. ఆమెను కుటుంబస భ్యులు భీమవరం లోని ప్రయి వేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని పడమటిపాలెంలోని ఆమె స్వగృహానికి తీసుకొచ్చారు. ఆమె మృతదేహాన్ని సిడిపిఒ ఊర్మిళ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు సందర్శించి నివాళులర్పించారు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. గతంలో మృతి చెందిన తోటికోడలు కుమారుడిని కూడా ఆమె పోషిస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎఎంసి ప్రాంగణంలో శు క్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల, నాయకుల సమావేశంలో ఆయన మాట్లా డారు. రానున్న ఎన్నికలలో ప్రజల ముందుకు వెళ్లి ఓటు అడిగే హక్కు కేవలం వైసిపికి మాత్రమే ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం'

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ప్రజల సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. ప్రజల వద్దకే పితాని కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెనుమంట్ర, బట్టల మోగుటూరు గ్రామాల్లో ఆయన ఇంటింటికి పాదయాత్రగా వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మూడు నెలల్లో టిడిపి, జనసేన కలిసి అధికారం చేపడతామని, ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి, పెనుగొండ సర్పంచి నక్క శ్యామలసోనీ పాల్గొన్నారు.

హోర్డింగ్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - పాలకొల్లు



ధ్వంసమైన బస్సు ముందుభాగం

అదుపుతప్పిన స్కూల్ బస్సు హోర్డింగును ఢీకొని ఆగడంతో పెనుప్రమాదం ప్రమాదం తప్పింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పూలపల్లిలోని శ్రీచైతన్య స్కూల్ బస్సు 30 మంది విద్యార్థులను బ్రాడీపేటలోని మెయిన్ క్యాంపస్‌కు తీసుకెళ్తుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుపుతుండగా పూలపల్లి బైపాస్ రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం వద్ద మోటార్ సైకిల్‌ను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని హోర్డింగును బలంగా ఢీకొట్టి ఆగింది. దీంతో బస్సు ముందు భాగం ఒక పక్క నుజునుజ్జయింది. డివైడర్ లేకపోతే పక్కనే ఉన్న గొయ్యిలో పడి పెను ప్రమాదమే జరిగి ఉండేది. ఈ సంఘటనలో విద్యార్థులు భయాందోళనకు గురై కేకలు వేశారు. పెనుప్రమాదం తప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ప్రమాదం స్థలం వద్దకు చేరుకుని పోలీసులు, రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

'ప్రజా సమస్యలు గాలికొదిలేసిన వైసిపి'

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా సమస్యలు గాలికి వదిలేసిన వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు కార్యకర్తలంతా నడుం బిగించి ముందుకు సాగాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి కానుపోతుగుంట బిసి కళ్యాణ మండపంలో టిడిపి మండలాధ్యక్షులు కేత మీరయ్య అధ్యక్షతన శుక్రవారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని వెంకట్ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపేందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలన్నారు.

నేడు కల్లు గీత కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 30, 31 తేదీల్లో తణుకులో నిర్వహించే గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ శనివారం తణుకులో అమరవీరుల భవనం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు గీత కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షులు కామన మునిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను సంక్షోభంలోకి తోసివేసిందన్నారు. వైసిపి అధికారంలో ఉన్నంత కాలం గీత కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా గీత వృత్తిని పూర్తిగా నాశనం చేసిందన్నారు. కరోనా సమయంలో కల్లును గీయకుండా నిరోధించారని, రాష్ట్రంలో గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించినా దానికి విధివిధా నాలను ప్రకటించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా వృత్తిని రక్షిస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో భక్షిస్తున్నారన్నారన్నారు. ఈ 15వ మహాసభలో అన్ని విషయాలు చర్చించి భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ బైక్ ర్యాలీలో రాష్ట్ర సంఘం అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు.

'దోచుకోవడం, దాచుకోవడమే జగన్ లక్ష్యం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దోచుకోవడం, దాచుకోవడమే సిఎం జగన్ లక్ష్యమని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, పట్టణ పార్టీ అధ్యక్షులు పట్నాల రాంపండు పాల్గొన్నారు.

కెపిపాలె నార్త్‌లో 'జయహో బిసి'

మొగల్తూరు : బిసిలకు రాజకీయ పదవుల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపికే దక్కుతుందని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు అన్నారు. కెపి.పాలెంనార్త్‌లో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన జయహో బిసి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రవాసాంధ్రుడు, టిడిపి నేత కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ మాట్లాడారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాజీ సర్పంచి సత్యనారాయణను సత్కరించారు.

'జగన్‌కు ఓటమి భయం'

ప్రజాశక్తి - కాళ్ల

సిఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని కోపల్లె గ్రామంలో శు క్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటినుంచి పార్టీనే నమ్ముకుని తమకు పార్టీలో గుర్తింపు లేదని, గ్రామాల్లో కనీసం అభివృద్ధి పనులు కూడా చేయలేని పరిస్థితుల్లో ఉన్న వైసిపి ప్రభుత్వంపై విసుగు చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరుతున్నారన్నారు.

బుజ్జిబాబు కుటుంబానికి జనసేన సాయం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం 29వ వార్డు అరుంధతీపేటకు చెందిన వసంతాడా బుజ్జిబాబుకు ఇటీవల కాలంలో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో నడవలేని స్థితిలో ఉన్నారు. ఆయన కుటుంబసభ్యులకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును శుక్రవారం బుజ్జిబాబు కుటుంబసభ్యులకు అందించారు.

టిడిపిలోకి పలువురు

కాళ్ల : రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధించడం ఖాయమని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని కోపల్లె గ్రామంలో వైసిపి నాయకులు పలువురు శుక్రవారం టిడిపిలోకి చేరారు. వైసిపి కోపల్లె గ్రామ అధ్యక్షుడు దంతులూరి శ్రీనివాసరాజు, ఉండి ఎఎంసి డైరెక్టర్ బుంగా ఆదాం డైరెక్టర్ పదవికి రాజీనామా చేసి ఎంఎల్ఎ మంతెన రామరాజు సమక్షంలో టిడిపిలోకి చేరారు. శ్రీనివాసరాజు, కాపా రాజశేఖర్ టిడిపిలోకి చేరారు.